

14న ఎస్‌టి వర్గీకరణ భేరి

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్రంలో ఎస్టీల వర్గీకరణ కు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసి పెంచలయ్య యానాది డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన గోడ పత్రిక ను విడుదల చేసి మాట్లాడారు. రాష్ట్రంలో 37 లక్షల గిరిజన జనాభాలో 10 లక్షలు యానాది జనాభా 30శాతం ముందంజలో ఉందని తెలిపారు. ఆర్థికంగా రాజకీయంగా సామాజికపరంగా వెనుకబడి ఉందని అందుకు ప్రత్యేక వర్గీకరణ అవసరమని పేర్కొన్నారు. ఎస్‌టి వర్గీకరణ సాధించేందుకు ఏప్రిల్ 14వ తేదీన నగరంలో ఎస్‌టి వర్గీకరణ భేరీ సభను ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చేవూరు సుబ్బారావు, జిల్లా చైర్మన్ రాపూరు కష్ణయ్య, జిల్లా అధ్యక్షులు మానికల మురళీ, మహిళా అధ్యక్షురాలు చెంబెటి ఉష, నగర అధ్యక్షురాలు కల్లూరు వరలక్ష్మి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరివీధి సతీష్ చంద్ర, కల్లూరు పెంచలప్రసాద్, వెంకట రమణ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రైతన్నకు తప్పని 'మద్దతు' తిప్పలు..!

◆కొనుగోళ్లలో అధికారులు మీనమేషాలు
◆ఇతర ప్రాంతాలకు తరలింపు
◆దళారులకు తెగనమ్ముకుంటున్న రైతులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రైతులు పండించిన పంట చేతి కొస్తుంది. ప్రభుత్వం మాట ఇచ్చిన విధంగా కొనుగోళ్లు సాగడం లేదు. రైతులు మద్దతు కోసం ఎదురు చూస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఇతర రాష్ట్రాలు, జిల్లాకు ధాన్యం తరలిస్తున్నారు. అక్కడ అధికారులు ఆంక్షలు పెట్టడంతో ఏం చేయాలో తెలియక రోడ్లపై ధాన్యం పెట్టుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకుంటాం, మద్దతు ధర ప్రకటిస్తామని చెబుతోన్న మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. గతంలో జిల్లాలో పెద్ద ఎత్తున ఆర్‌బికె, సివిల్ సప్లయ్, ఎఫ్‌సిఐ కేంద్రాల ద్వార పెద్దఎత్తున ధాన్యం కొనుగోలు చేసేవారు. గత నాలుగేళ్ల నుంచి ఇది పడకేసింది. నాలుగేళ్ల నుంచి ప్రభుత్వానికి రేషన్‌బియ్యం, హాస్టళ్లు ఇతర అవసరాలకు ఉపయోగపడే సిఎంఆర్ ప్రభుత్వం స్వీకరించడం లేదు. గతేడాది జులై నుంచి కేంద్ర ప్రభుత్వం బియ్యం ఎగుమతులను నిలిపేసింది. బియ్యం ధరలు మార్కెట్‌లో రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ధాన్యం ధరలు రోజు రోజుకు పడిపోతున్నాయి. ఈ రహస్యం అర్థంకాక రైతులు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వ ప్రకటించిన మద్దతు ధరకంటే తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు 74 వేల మెట్రిక్ టన్నులు సేకరించింది. ఇప్పటికీ రైతులు రోడ్లపై ధాన్యం పెట్టుకున్నారు.

రైతులు పండించిన పంట చేతికొస్తుంది. ఇప్పటికే మెట్ట ప్రాంత రైతులు ఉదయగిరి, సీతా రాపురం, మర్రిపాడు, వరికుంటపాడు, వింజమూరు, దుత్తలూరు వంటి ప్రాంతాల్లో ఈ ఏడాది ఎర్ర జగిత్యాల (మసూర) రకం సాగు తక్కువ ధరలకు అమ్ముక ...న్నారు. ప్రతేడాది మంచి ధర వస్తుండడంతో ఈ ఏడాది దానిని రైతులు పెద్ద ఎత్తున సాగు చేశారు. జిల్లా వ్యాపితంగా ఏగ్రేడ్ రకం కెఎన్ఎం, సుగర్ లెస్, బిపిటి తోపాటు 1001 రకం సుమారు 7 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. కోతలు ఊపందుకున్నాయి. దాదాపు పూర్తికా వచ్చాయి.. ఎకరా సాగుచేయడానికి సుమారుగా రూ. 26,500 ఖర్చు చేశారు. వరిసాగు రైతుకు రోజు రోజుకు భారంగా మారుతోంది. ప్రతిది భారీగా ధరలు పెరిగిపోతున్నాయి. పండించిన పంటకు మాత్రం మద్దతు ధర దక్కడం లేదు.. ఇందుకు ప్రధాన కారణం తెగుళ్లు,. గతంలో ఎకరానికి 4 పుట్లు వస్తుండగా, ఈ ఏడాది రూ.2.5 పుట్లు మాత్రమే దిగుబడి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. వాతావరణంలో వచ్చిన ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి స్థితి వచ్చిందని రైతులంటున్నారు. దీనికి తోడు సాగు కష్టంగా మారింది. కూలీల రేట్లు, డీజిల్ ధరలు, పెరుగుదలతోపాటు, మద్దతు ధర లభించడం లేదు. ఎకరా పొలం దుక్కిదున్నడానికి రూ.7000, నాట్లు వేయడానికి రూ.7000, డిఎపి బస్తా రూ.1700, యూరియా రెండు బస్తాలు రూ.700, స్ప్రేయర్ మందు రూ.1000, కలుపునకు రూ.2500, వరి కోతకు రూ. 3500,ఖర్చు చేస్తున్నారు. ఎకరానికి రూ.26,200 పెట్టుబడి పెడుతున్నారు. యంత్రాలు, లేదా కూలీలతో చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతేడాది ఆర్‌బికెలు, డిఆర్‌డిఎ, సివిల్‌సప్లయ్, ఎఫ్‌సిఐ ద్వార ధాన్యం కొనుగోలు చేసేది. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి అందుకు అనుగుణంగా కొనుగోలు చేసేవారు. వారం పది రోజుల్లో తమ ఖాతాల్లో నగదు జమ అయ్యేవి. ఇప్పుడు ఆపరిస్థితి కనిపించడం లేదు. రైతులు ప్రభుత్వం తమ ధాన్యం కొనుగోలు చేస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.

అల్లూరు మండలం సింగపేట వద్ద పది రోజుల నుంచి రోడ్డుపైనే ఉన్నా ధాన్యం

రోడ్లపైనే ధాన్యం...ఆలస్యం నగదు..!

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది సుమారు మూడు వందల ఆర్‌బికె కేంద్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని ఇటీవల జాయింట్ కలెక్టర్ కార్తీక్ ప్రకటించారు. గతంలో ప్రభుత్వమే పెద్ద ఎత్తున కొనుగోలు చేసేది. సిఎంఆర్ కోసం మిల్లర్లకు ఆదేశాలిచ్చేది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్ల నుంచి లెవీ బియ్యాన్ని జిల్లాలో కొనుగోలు చేయడం లేదు. శ్రీకాకుళం, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి రేషన్ షాపులు, హాస్టళ్లకు తెచ్చుకుంటుంది. ఈ విధానాన్ని పక్కన పెట్టి ఇక్కడే ధాన్యం కొనుగోలు చేస్తారని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం పుట్టి రూ.19720 ప్రకటిచింది. సుమారు 2.5 లక్షల టన్నులు కొనుగోలు చేస్తామని కలెక్టర్ ఆనంద్ ప్రకటించారు. ఇప్పటి వరకు 74 వేల టన్నులు కొనుగోలు చేశారు. రైతుల నుంచి సిబ్బంది సరిగా కొనుగోలు చేయడం లేదు. రైతులు ఆర్‌బికెలకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదు. దీంతో దళారులు, కొందరు వ్యక్తులకు . పుట్టి రూ.17 వేలకు అమ్ముకుంటున్నారు. తరువాత అధికారపార్టీకి చెందిన కొందరు వ్యక్తులు రూ.19,720లకు కేంద్రాల్లో విక్రయించుకుంటున్నారు. కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమచేస్తామని చెబుతున్నా అది జరగడం లేదు. జిల్లాలోని అల్లూరు, సింగపేట, సున్నపుబట్టి తదితర ప్రాంతాల్లో వారం రోజులు అవుతున్నాయి. అల్లూరు మండలం, సింగపేట వద్ద వెంకటేష్ అనే రైతు 150 టన్నులు ధాన్యం పది రోజుల నుంచి రోడ్డు మీదే పెట్టుకున్నారు. సిబ్బందికి చెప్పినా ఇదిగో, అదిగో అని చెబుతుండడంతో రైతులు ఇబ్బందులు పడు తున్నారు. గుంటూరు, బాపట్ల నుంచి మిల్లర్లు ఇక్కడకు వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తుండగా, స్థానిక మిల్లర్లు నిలుపుదల చేశారు. టన్నుకు 30 నుంచి 40 కేజీలు తరుగు కింద మిల్లర్లు రైతుల నుంచి తీసు కుంటున్నారు. అధికారులు ధాన్యం వెంటనే కొనుగోలు చేయడం, నగదు వెంటనే చెల్లించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఎస్‌సి,ఎస్‌టిల అభ్యున్నతికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో ఎస్‌సి,ఎస్‌టిల అభ్యున్నతికి కషి చేస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకలను సాంఘీక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో జయంతి వేడుకలను ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో సామాజిక న్యాయం కోసం పోరాడి బడుగు బలహీన వర్గాల ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన గొప్ప సంఘ సంస్కర్త జగ్జీవన్ రామ్ అని అన్నారు. ఎందరో మహనీయులు ఎన్నో అవమానాలు, ఇబ్బందులను అధిగమించి ఉన్నతస్థానాల్లో అందరికి ఆదర్శంగా నిలిచారని, దేశం కోసం త్యాగాలు చేశారని, వీరిని ఆదర్శంగా తీసుకుని ఎన్ని కష్టాలెదురైనా బాగా చదువుకుని తమ హక్కులు సాధించుకోవాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం గురించి గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని పలు సంఘాల నాయకులను కోరారు.

ఈ చట్టం ఎటువంటి రక్షణ కల్పిస్తుందో వివరించాలన్నారు. తొలుత పలు సంఘాల నాయకులు జగ్జీవన్ రాం జీవిత విశేషాలు, రాజకీయంగా ఆయన ఎదిగిన తీరు, దేశానికి, బడుగు బలహీనవర్గాలకు ఆయన చేసిన సేవలను వివరించారు డిఆర్‌వో ఉదయ భాస్కర్‌రావు, సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి,ఎస్‌సి కార్పొరేషన్ ఈడి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

'ఎన్‌టిఆర్ సుజల స్రవంతి' పనులు వేగవంతం

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర పట్టణ, పురపాలక శాఖ మంత్రి డాక్టర్. పి. నారాయణ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ పరిధిలో సురక్షిత తాగునీటి సరఫరా ఎన్టీఆర్ సజల పథకం పనులను వేగవంతం చేసి అన్ని ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులోకి తేవాలని కమిషనర్ సూర్య తేజ అధికారులను ఆదేశించారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం, జనార్ధన్ రెడ్డి కాలనీ ప్రాంతాల్లోని ఎన్టీఆర్ సజల తాగునీటి సరఫరా కేంద్రాలను శనివారం తనిఖీ చేసి తాగునీటి నాణ్యతను పరీక్షించారు. అనంతరం ఆత్మకూరు బస్టాండు, మినీ బైపాస్ తదితర ప్రాంతాలలో విద్యుత్ వీధిదీపాల వ్యవస్థను కమిషనర్ పరిశీలించారు. స్థానిక పొదలకూరు రోడ్డు ప్రధాన మార్గంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ కార్యక్రమాలను పర్యవేక్షించారు. రోడ్డు విస్తరణ కార్యక్రమంలో నిర్దేశించిన పరిధి మేరకు విస్తరణను చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్.ఈ. రామ్మోహన్ రావు, ఇంజనీర్లు,పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు వేణు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పథకం పనులు పరిశీలిస్తున్న కమిషనర్

మాలకొండలో పర్యటిస్తున్న ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు

మాలకొండ'లో ఎంఎల్‌ఎ 'ఇంటూరి'

ప్రజాశక్తి - వలేటివారిపాలెం

మండలం మాలకొండ గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు శనివారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ వేద పండితులు, అధికారులు ఎంఎల్‌ఎకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న ఎంఎల్‌ఎకు వేద పండితులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శనం ఏర్పాట్లు చేయాలని, నాణ్యతతో కూడిన ప్రసాదాన్ని భక్తులకు అందించాలని, అన్నదాన ప్రసాద కేంద్రంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు.. అక్కడ జరుగుతున్న పలు అభివద్ధి పనులు పరిశీలించారు. అధికారులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. కొండ దిగువ భాగంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వసతి రూము లను పరిశీలించారు. ఆయన వెంట ఆలయ ఇఒ సాగర్ బాబు వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నాయకులు కాకుమాని హర్ష, సోమినేని రవీంద్ర ఉన్నారు.

మరమ్మతులకు నోచని బోరు

మరమ్మతులకు నోచని బోర్లు

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్

మండలంలోని పలు పంచాయతీలలో చేతి బోర్లు నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామాల్లో రోడ్ల నిర్మాణం కారణంగా చేతిబోర్లు మట్టిలో కూరుకుపోయాయి. వాటి ఎత్తు పెంచి వాడుకులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. బోరు మెకానికులు మండల ఆఫీస్‌కు పరిమితమై ఉన్నారని, మరమ్మతులకు గురైన బోర్లు రిపేరు చేయకుండా కంప్లైంట్ ఎవరైనా ఇస్తే ఇప్పుడు చేతి బోర్లు వాడేది ఎవరూ.. అంటూ చెబుతూ మొఖం చాటేస్తున్న పరిస్థితి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో పొలాలకు వెళ్లే దారుల్లో పశువులు, కాపర్లకు, బాటసారుల దాహార్తిని తీర్చే బోర్లు నిరుపయోగంగా మారాయి. మరమ్మతులు చేసేవారు లేకపోవడంతో అవి శిథిలావస్థ స్థితికి చేరాయి. అధికారుల నిర్లక్ష్యం.. అలసత్వం కారణంగా ఆ పరస్థితి నెలకొంది. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు స్పందించి బోర్ మెకానిక్‌లు బోర్లు రిపేరు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల కలెక్టర్ ఆనంద్ వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. ఆ నేపథ్యంలోనైనా మండల స్థాయి అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు కూడా స్పందించి వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

నెల్లూరు : భారత మాజీ ఉప ప్రధాని, గొప్ప సంఘసంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం నగరంలోని వేదయపాలెంలో గల జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి కషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని, సామాజిక న్యాయం కోసం జగ్జీవన్ రామ్ చేసిన పోరాటం వెలకట్టలేనిదని కలెక్టర్ ఆనంద్ అన్నారు. సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు, పలు సంఘాల నాయకులు జన్ని రమణయ్య, బద్దెపూడి గిరి, బోనబోయిన ఆదిశేషయ్య, పందిటి సుబ్బయ్య, కుడుముల సుబ్బారావు, మాతంగి కష్ణ, గుంటి కష్ణయ్య, రవి రాఘవేంద్ర, ఆనంద రావు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో..

తన 50 ఏళ్ల రాజకీయ జీవితాన్ని పోరాటానికి అంకితం చేసి, దళితుల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి బాబు జగజ్జీవన్‌రావు అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్‌లన్నారు. శనివారం బాబు జగజీవన్ రావు 118వ జయంతిని పురస్కరించుకోని సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో వేదాయపాలెంలోని ఆ మహోన్నత వ్యక్తి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ బాబు జగజ్జీవన్ రావు ఉత్తమ పార్లమెంటేరియన్‌గా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన నాయకుడన్నారు. జనం కోసమే ఆయన జీవితాన్ని పూర్తిగా అంకితం చేశారన్నారు. దేశ స్వతంత్ర పోరాటంలో ఆయన పాత్ర అద్వితీయమన్నారు. కెవిపిఎస్ నాయకులు నందిపాటి మాలకొండయ్య సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు మల్ల సుధాకర్ ఎస్డి రఫీ అహ్మద్ ఆర్ వి రావు ఎస్.కె శంషాద్ ఒంగోలు సుధీర్ ఎస్కె ఖలీల్ డివైఎఫ్ఐ నాయకులు గోను చైతన్య ఈశ్వరయ్య పుల్లయ్య డి చిన్నయ్య పాల్గొన్నారు

సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రభుత్వ కార్యాలయాల్లో..

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకోని నగరంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పి జి.కృష్ణకాంత్, విద్యుత్తు భవన్‌లో ఎస్‌ఈ వి.విజయన్‌ల ఆద్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మానవతావాదం, ఆదర్శవాదం వంటి పలు సద్గుణాలు కలిగిన మహోన్నత వ్యక్తి బాబూ జగజ్జీవన్ రామ్ అన్నారు.

ఎన్‌జిఓ భవన్‌లో

నగరంలోని ఎన్‌జిఒ భవన్‌లో ఎపి ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి పెంచలరావు అధ్యక్షతన దార్శనికుడు పరిపాలన దక్షుడు భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజీవన్ రామ్ జయంతి ఉత్సవ సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగజ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు

నగర పాలక ప్రాథమిక పాఠశాలలో

కొండాయపాళెం లోని నగర పాలక ప్రాథమిక పాఠశాల లో డాక్టర్ బాబు జగజ్జీవన రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం భాస్కర్ రావు విద్యార్థులతో కలిసి జగజ్జీవన రామ్ చిత్ర పటానికి నివాళులు అర్పించిమాట్లాడారు.

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు పూలమాలవేసి నివాళి అర్పించారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభివద్ధి కోసం నిరంతరం పోరాడిన గొప్ప వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. పట్టణంలోని చర్చి సెంటర్ వద్ద డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరావు ఘన నివాళులర్పించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు పట్టణ మాజీ టిడిపి అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, కంద్రా మాల్యాద్రి, ఉప్పుటూరి శ్రీనివాసరావు, బిజెపి నాయకులు ఘట్టమనేని హరిబాబు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయపాటి శ్రీనివాసరావు పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య, గోచిపాతల మోషే, రెబ్బవరపు మాల్యాద్రి, బద్దిపూడి శికామణి, గురజాల బెంజిమెన్, పులి నాగరాజు, చనమాల శ్రీధర్, పాలేటి కోటేశ్వరరావు, మట్టిగుంట శీను, కావలి ఏసుదాసు, దార్ల సుబ్బారావు, లింగాబత్తిన మాల్యాద్రి, చేవూరి రమేష్ బాబు, అక్కిలగుంట ఆశీర్వాదం, గోచిపాతల ప్రసాదు, జడ రవీంద్ర, మెండా లెనిన్ బాబు, ఎండ్లూరి పుల్లయ్య చదలవాడ ఇమ్మానియేలు, ఉచ్చులూరి సుబ్బారావు ఉన్నారు.

కందుకూరులో..

సిపిఐ ఆధ్వర్యంలో...

డాక్టర్ బాబు జగ్జీవన్ రావు 117 జయంతి వేడుకలు సందర్భంగా పట్టణంలోని చర్చి సెంటర్లో ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్ రావు కాంస్య విగ్రహానికి సిపిఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివద్ధి కోసం నిరంతరం పోరాటం చేసి వారి శ్రేయస్సు కోసం ముందుకు నడిచిన వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్ రావు అని అన్నారు. సిపిఐ కొండేపి నియోజకవర్గ కార్యదర్శి కే.వీరా రెడ్డి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి యర్రంశెట్టి ఆనందమోహన్, సిపిఐ కార్యవర్గ సభ్యులు షేక్ హుస్సేన్, నాయకులు బొల్లోజుల బాల బ్రహ్మచారి, ఉప్పుటూరి మాధవరావు, కోటేశ్వరరావు ఉన్నారు.

ప్రజాశక్తి - గుడ్లూరు : జగ్జివన్‌రామ్ జయంతి సందర్భంగా గుడ్లూరులోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ వై వెంకటేశ్వరరావు అధ్యక్షతన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. బాబు జగజ్జీవన్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గుడ్లూరు సర్పంచి పాలకీర్తి శంకర్ కార్యాలయం అధికారులు పాల్గొన్నారు.

డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో..

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారి కార్యాలయంలో డాక్టర్ బాబు జగజీవన్ రామ్ జయంతి వేడుకలను నిర్వహించడమైనది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. సుజాత డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టరు బాబు జగజ్జీవన్‌రామ్ భారతదేశానికి చేసిన సేవను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఎల్ ఏ టి ఓ డాక్టర్ ఖాదర్ వలీ, డీఐఓ ఉమామహేశ్వరి, డిఎంఓ హుస్సేన్ అమ్మ, డెమో కనకరత్నం, డీఎస్‌ఓ డాక్టర్ భాస్కర్, ఏవో నిశాంత్ రెడ్డి మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొని డాక్టర్ బాబు జగజీవన్ రామ్ చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు.

నగరపాలక సంస్థ పాఠశాలలో..

శ్రీరామనవమి శుభాకాంక్షలు : ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు నియోజకవర్గ ప్రజలకు ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు. .శ్రీరామనవమి పర్వ దినాన్ని ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఇంటూరి నాగేశ్వరరావు , ఎంఎల్‌ఎ

ప్రజలు సంతోషంగా ఉండాలి : బుర్రా

కందుకూరు నియోజకవర్గ ప్రజలకు వైసిపి కందుకూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

బుర్రా మధుసూదన్ యాదవ్

ఘనంగా హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కందుకూరు

పట్టణంలోని ఓ.వి రోడ్డులో శ్రీ శివ సాయి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ 25వ వార్షికోత్సవ వేడుకలు శనివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి స్కూల్ కరస్పాండెంట్ ఓరుగంటి శివరామయ్య ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావుకి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. తొలుత ఎంఎల్‌ఎ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.. ఎంఎల్‌ఎ నాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు కన్న కలలను పిల్లలు సాకారం చేయాలని చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులను తల్లిదండ్రులను పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలని సూచించారు.. విద్యార్థులలో సమాజ సేవా దక్పథం పెంపొందించడానికి శ్రీ శివ సాయి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కషి చేస్తుందని ఎమ్మెల్యే ప్రశంసించారులో శివ సాయి పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ

రాజ్యాంగ పరిరక్షణకు కృషి : యుటిఎఫ్

ప్రజాశక్తి -నెల్లూరు : దేశ రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యున్నతమైనదని, సమానత్వం, భిన్నత్వంలో ఏకత్వం, మానవతా దృక్పథం, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం నగరంలోనియుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకోని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.వి శేషులు అధ్యక్షత వహించారు. నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విభిన్న భావాలు, ఆచారాలు, భాషలు కలిగిన దేశంలోని ప్రజలందరినీ ఐక్యం చేసే ఏకైక సాధనం భారత రాజ్యాంగం అన్నారు. సమానత్వం, ప్రజాస్వామ్యం, సోషలిజం, లక్ష్యాలుగా కలిగిన రాజ్యాంగాన్ని అమలు చేయడంలో పాలకులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యనభ్యసించిన విద్యుర్థులల్లో నైతిక, మానవతా విలువలు పెంపొందుతా యన్నారు. అటువంటి ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకొనేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వి.శేషులు , జి.వి చలపతి శర్మలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేర్పించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు, సహాధ్యక్షులు ఎంసి అచ్చయ్య, కోశాధికారి ఎ.మురళీధరరావు, జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.



జగ్జివన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆటో కార్మికుల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కోలగట్ల సురేష్ మాట్లాడుతూ ఈ జిల్లాలో దాదాపుగా 50వేల మంది ఆటోలను నమ్ముకుని కార్మికులు జీవనం సాగిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వకానీ, ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వాలు ఆటో కార్మికులపై జీఓ నెంబర్ 21 పేరుతో ఆర్థిక భారాన్ని మోపుతూ పలు ఇబ్బందులు పెడుతున్నారన్నారు . గత ప్రభుత్వం ఆటో కార్మికులకు ఏర్పాటు చేసిన వాహన మిత్ర పథకాన్ని, అధికారంలోని కూటమి ప్రభుత్వం ఇంతవరకు అమలు చేయలేదన్నారు. అంతేకాకుండా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో రవాణా రంగం పై కేంద్ర ప్రభుత్వం కఠినమైన శిక్షలతో కూడిన చట్టాన్ని తీసుకొచ్చి రవాణా రంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా ప్రయత్నం చేస్తూ ప్రయివేట్ కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నం చేస్తుందన్నారు. అందులో భాగంగా వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇచ్చేటటువంటి బాధ్యతను ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించి ఆర్‌టిఎ కార్యాల యాలను కూడా నిర్వీర్యం చేసేటటువంటి ప్రయత్నం చేస్తుందన్నారు. దీనివలన జిల్లాల్లో ఉండే ఆర్‌టిఎ కార్యాలయాలను కూడా సర్టిఫికెట్లు ఫిట్నెస్ అధికారం కోల్పోతాయన్నారు. కాబట్టి వాహనాల సెన్సార్ ట్రాకింగ్ పద్ధతిని రద్దు చేయాలని, లేని పక్షంలో వాహనదారులకు అందుబాటులో ఉండే విధంగా గతంలో ఏ విధంగా అయితే ఫిట్నెస్ సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నారో అదే విధంగా చేయాలన్నారు.కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున, షేక్ జానాబాషా, ఆటో కార్మిక సంఘం మండల కార్యదర్శి రాధయ్య, రమేష్, ఆటో కార్మికులు సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : స్థానికంగా నెలకొన్న పారిశుధ్య ఇతరత్రా సమస్యల పరిష్కారానికి ఆయా ప్రాంతాల నాయకులు చొరవ చూపాలని శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సూచించారు. పట్టణంలోని 5,6,7 వార్డులలో ఆమె ఆకస్మికంగా శనివారం పర్యటించారు.ఆయా ప్రాంతాలలో నెలకొన్న సమస్యల గురించి అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాను వస్తున్నానని తెలుసుకున్న అధికారులు, కౌన్సిలర్లు అక్కడి పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలు తెలుసుకొని ఆయా వార్డులలోని సమస్యలపై కౌన్సిలర్లు, నాయకులు చొరవ చూపాలన్నారు. ఖాజా నగర్ లోని గుడిపల్లి కాలువకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నిధులలో రూ.12 లక్షల 50 వేలు నీటి ఎద్దడి ఉన్న వార్డులలో బోర్లు నిర్మించి 7 లక్షల రూపాయలతో గుడిపల్లి కాలువ కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. నగర పంచాయతీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్మన్లు శివ కుమార్ రెడ్డి, పఠాన్ నస్రీన్ ఖాన్, కమిషనర్ బాలకృష్ణ, పట్టణ,రూరల్ అధ్యక్షులు ఎం.వి శేషయ్య, బత్తల హరికృష్ణ, సూరా శ్రీనివాసులు రెడ్డి, పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, కౌన్సిలర్లు, తాసిల్దార్ అంబటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీహరి, మోర్ల మురళి నాయకులు ఉన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి-నెల్లూరు : పేద ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని జనసేన పార్టీ సీనియర్ నేత, కోర్ కమిటీ సభ్యులు నూనె మల్లికార్జున యాదవ్ పేర్కొన్నారు. టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ సూచన మేరకు శనివారం స్థానిక వెంకటేశ్వరపురం లోని టిడ్కో గృహాల వద్ద స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా నూనె మల్లికార్జున్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ముఖ్యంగా వేములపాటి అజయ్ కుమార్ రాష్ట్రమంతా పర్యటించి అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సుందర్ రామిరెడ్డి , గునుకుల కిషోర్, పవన్, మధు, పాల్గొన్నారు.

రావి విజయ్ పాదయాత్ర

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కొండ బిట్రగుంట వాసి టిడిపి తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ నెల్లూరు పార్లమెంట్ రావి విజయ్ కుమార్ యాదవ్ సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడాలని, ఎంఎల్ఎ దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అధిక మెజారిటీతో గెలుపొందాలని అదేవిధంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఎంఎల్సీగా ఎన్నికైనందున తన మొక్కును తీర్చుకునేందుకు కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నుండి పెంచలకోన నరసింహస్వామి దేవస్థానం వరకు పాదయాత్రను శనివారం బిట్రగుంట నుండి ప్రారంభించారు. ఆయనకు మద్దతుగా తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న లారీ

ప్రజాశక్తి-సంగం : సంగం జాతీయ రహదారిపై కొడవలూరు వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నెల్లూరు వైపు నుండి ఆత్మకూరు వైపు వెళ్తున్న సిమెంట్ లారీ సంగం ఊళ్లో నుండి రోడ్డు దాటుతున్న ఆర్‌టిసి బస్సును అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్‌టిసి బస్సులో ఉన్న సుమారు పదిమందికి పైగా ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జాతీయ రహదారిపై వాహనాలు అతివేగంగా నడపరాదని ఎస్ఐ సూచించారు.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-మర్రిపాడు : మండల ప్రజలు ప్రశాంత వాతావరణంలో శ్రీరామనవమి ఉత్సవాలు జరుపుకోవాలని ఎస్ఐ శ్రీనివాస రావు కోరారు. ఉత్సవాల్లో డీజేలు, మైకులకు పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. ఉత్సవాల సందర్భంగా ఎక్కడైనా రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించిన అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన, పేకాట, మద్యం సేవించడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కులమతాలకు అతీతంగా ఉత్సవాలు జరుపుకోవాలన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-సంగం : సంగంలో సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండటంతో ఆలయ పరిసర ప్రాంతాలను ఎస్ఐ రాజేష్, పంచాయతీ కార్యదర్శి నరసయ్య సందర్శించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ సమీపంలో గుంతలను పూడ్చించారు. రోడ్డుకి ఇరువైపులా ఉన్న దుకాణదారులకు పలు సూచనలు చేశారు. ఆలయం వద్ద ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. బ్రహ్మోత్సవాల సమయంలో సాయంత్రం నుండి రాత్రి 11 వరకు హెవీ వెహికల్స్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు. దుకాణదారులు తమ దుకాణాలను ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనదారులు, దుకాణదారులు బ్రహ్మోత్సవాలకు సహకరించాలని కోరారు.

వివేకానంద స్కూల్‌కు ప్రత్యేక స్థానం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : జిల్లాలో గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలో వివేకానంద స్కూల్ కు ప్రత్యేక గుర్తింపు దక్కిందని ఎంఎల్సి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వివేకానంద స్కూల్ వార్షికోత్సవం జరిగిన 32వ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత 32 సంవత్సరాలుగా స్కూలును కొనసాగించడం గొప్ప విషయమన్నారు. జిల్లాలో వివేకానంద స్కూలుకు ప్రత్యేక గుర్తింపు దక్కిందన్నారు. బుచ్చిరెడ్డి పాలెంలో కార్పొరేట్ విద్యాసంస్థలు పెరిగిన తనదైన శైలిలో మధ్య తరగతి వారికి అర్థికంగా అందుబాటులో ఉండేలా విద్యార్థుల భవిష్యత్తును పక్క దిద్దుతూ ముందుకు సాగుతున్న స్కూల్ యాజమాన్యాన్ని, సిబ్బందిని కొనియాడారు. అనంతరం పాఠశాల యజమాన్యం ఆయనను ఘనంగా సన్మానించారు.

ఘనంగా జాతీయ మారిటైమ్ దినోత్సవం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : కృష్ణపట్నం పోర్టులో శనివారం అత్యంత ఘనంగా 62వ జాతీయ మారిటైం దినోత్సవం వేడుకలు జరిగాయి. ఈ సంవత్సరం వేడుకల థీమ్ "సముద్ర సాగర్-విక్షిత్ భారత్ ది యాంప్ నీలి అర్థ్ లెట్ హిలత్ విజన్ కే లై యువ". ఇ ది భారతదేశంలో సంపన్నమైన సముద్రమ రంగం, నీలి ఆ ర్థిక వ్యవస్థ, హరితవృద్ధి, యువత పాత్రను హైలైట్ చేస్తుంది. మ్యారిటన్ దినోత్సవ సం దర్భంగా ఆదాని కృష్ణపట్నం పోర్టు ఉద్యోగులు బెలూన్స్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అదాని కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ ఉద్యోగులు, కార్మికులు, ఇండియన్ కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీస్, కస్టమ్స్, షిప్ మాస్టర్స్, తదితరులున్నారు.

హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి విడవలూరు : మండల పరిధిలోని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ నరేష్ యాదవ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు బైక్ పై వెళ్లేప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. బైక్ డ్రైవ్ చేస్తూ ఫోన్ మాట్లాడకూడదన్నారు.

పలుచోట్ల బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

నెల్లూరులో..

ప్రజాశక్తి-నెల్లూరు

భారతదేశంలో సామాజిక న్యాయ సాధనకు కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యన్.రఘురామయ్య, ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన తరువాత కుల వివక్షకు అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడని, చిన్నతనంలోనే అనేక అవమానాలను ఎదుర్కొని భారతదేశ ఉప ప్రధానిగా, కార్మిక శాఖ మంత్రిగా తనదైన శైలిలో పనిచేసి దేశ అణ గారిన వర్గాల ప్రజలకు అనేక హక్కులను సాధించడంలో కీలక పాత్ర పోషించాడని తెలిపారు. అలాంటి మహనీయులు సాధించిన హక్కులను నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తూ భారతదేశ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ప్రజల హక్కులను అణచివేస్తున్నారని నేడు ఆ మహనీయుని ఆదర్శంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వంపై పోరాడాల్సిన అవసరం ఎంతైనా మనపైన ఉందని అప్పుడే హక్కులను కాపాడుకోగలమన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు జి.సుధీర్, పచ్చ కిరణ్, పి.విజయకుమార్, శ్రీపతి వెంకయ్య, నందిపాటి మాలకొండయ్య, ఎం సుధాకర్, ఎస్డీ రఫీ, శంషాద్, ఎస్కె షబ్బీర్ పాల్గొన్నారు.

బిట్రగుంటలో..

ప్రజాశక్తి-బిట్రగుంట : భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను మండలం టిడిపి కార్యాలయంలో శనివారం మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం టిడిపి నాయకులతో కలిసి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం, సామాజిక సమానత్వం కోసం పోరాడిన ఆదర్శనేత డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అని, దేశానికి ఆయన చేసిన సేవలు నిరుపమానం అని, దళితుల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎల్.సుధీర్ బాబు, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి లక్కాకుల మాధవరావు, సీనియర్ నాయకులు రామ్మోహన్ రెడ్డి, ఆవుల సురేష్, ఎస్కె రఫీ, నాటకరాణి రంగయ్య, జానకి రామయ్య, నాగరాజు, ఇశ్రాయేలు, మహిళ నాయకురాలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. బోగోలు బిజెపి కార్యాలయంలో బాబూ జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలను మాజీ మండల అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల నాయకులతో కలిసి నిర్వమించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా శనివారం కావలి ట్రంకు రోడ్డు ఎండిఒ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ జగ్జీవన్ రామ్ విగ్రహానికి కెవిపిఎస్, కుల వివక్షత పోరాట సమితి జిల్లా అధ్యక్షులు జాన్, వ్యవసాయ కార్మిక సంఘం కావలి మండల అధ్యక్షులు సీతారామయ్య, మధు, కమలాకర్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం, సామాజిక సమానత్వం కోసం పోరాడిన ఆదర్శనేత డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అని, దేశానికి ఆయన చేసిన సేవలు నిరుపమానం అని, దళితుల అభ్యున్నతికి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ ఎనలేని కృషి చేశారని తెలిపారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం చెంచులక్ష్మిపురం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బోగోలు మండలం ఎంఆర్‌పిఎస్ పక్షాన ఎంఇఎస్, ఎంటిఎస్ యానాది సంక్షేమ సంగం పక్షాన భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రావ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘన నివాళు లర్పించారు. కార్యక్రమంలో బుద్దయ్య, రాధయ్య, ఇజ్రాయేలు, బోగిరి యోహాను, బోగిరి ప్రభాకర్, రమణయ్య పాల్గొన్నారు.

వరికుంటపాడులో...

ప్రజాశక్తి-వరికుంటపాడు : ఎంపిడిఒ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి నాగురుపల్లి ఆధ్వర్యంలో టిడిపి మండల అధ్యక్షులు చంద్ర మధుసూదన్ రావు అధ్యక్షతన బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా చంద్ర మధుసూదన్ రావు మాట్లాడుతూ అణగారిన వర్గానికి అండగా నిలిచి సమ సమాజ స్థాపనకు పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులు బాబూ జగ్జీవన్ రామ్ అని అన్నారు. అనంతరం ఎస్‌సిసెల్ అధ్యక్షులు తాతపూడి లభాను మాట్లాడుతూ భారతదేశంలో ఆహార సంక్షోభం ఉన్నప్పుడు తనవంతు క్రియాశీలక పాత్ర పోషించార న్నారు. కార్యక్రమంలో టిడిపి మాజీ మండల కన్వీనర్ చంద్ర వెంకయ్య, మండల తెలుగు యువత అధ్యక్షులు ముజ్జే లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు పోక మహేష్, పేరం సుధాకర్ రెడ్డి, నందిపాటి ఆరోను, కొనిగిపోగు వెంగయ్య, చేవూరి సుకుమార్, కొండే పోగు ప్రసాద్, నూతలపాటి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వింజమూరులో..

ప్రజాశక్తి-వింజమూరులో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వింజమూరులోని బంగ్లా సెంటర్ వద్ద ఎంఎస్‌పి మండల ఇన్‌ఛార్జి జి.ఆనందరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ మాసిలమని ఎంఎస్‌వి జిల్లా అధ్యక్షులు పి అంబేద్కర్ పాల్గొన్నారు. ముందుగా జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల కోసం అణగారిన వర్గాల కోసం వారి అభ్యున్నతి కోసం అన్ని అన్ని విధాలుగా పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో ప్రేమ దాసు, వెంగయ్య, సింహాద్రి, తిరుమలేష్, సుధాకర్, రాజేంద్ర, నాగరాజు, గొల్లపల్లి పెంచలయ్య, ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సీతారామపురంలో..

ప్రజాశక్తి-సీతారామపురం : స్వాతంత్ర్య సమరయోధుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దళిత నాయకులు ఘనంగా నిర్వహించారు. బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు అణగారిన వర్గాల ఆశాజ్యోతి సంఘ సంస్కర్త రాజకీయవేత్త బాబూ జగ్జీవన్ రామ్ అని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కలివెల జ్యోతి, మాజీ ఎంపిపి నేలటూరి అబ్రహం, దళితుల అగ్ర నాయకుడు కలివేల ఎలీషా కుమార్, మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు బొగ్గవరపు రత్నం, మండల కోఆప్షన్ సభ్యుడు పెద్దపులి హైదర్ వలి, దళిత నాయకులు జాషువా, ఇజ్రాయిల్ ఉపాధ్యాయులు ఎ వి రమణయ్య, రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరిలో..

ప్రజాశక్తి-ఉదయగిరి : భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగజీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు ఎంఇఒ షేక్ మస్తాన్ వలీ, మేకపాటి వ్యవసాయ కళాశాలలో డీన్ డాక్టర్ జి కృష్ణారెడ్డి గ్రామపంచాయతీ ఇఒపిఆర్‌డి కరిముల్లా, ఉపసర్పంచ్ ముర్తుజా, పలు ప్రయివేటు పాఠశాలలు కార్యాలయంలో అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సామాజిక సంస్కరణ ఉద్యమాలు నిర్వహిం చిన సంఘసంస్కర్త బాబూ జగజ్జీవన్ రామ్ అని కొనియాడారు. ఆయన దేశ అభివృద్ధి కోసం ఎనలేని కషి చేశారని గుర్తు చేశారు. ముఖ్యంగా కుల విద్వేషాలు అంద విశ్వాసాలు మూఢనమ్మకాలు నిర్మూలించడం కోసం సామాజిక సంస్కరణలు నిర్మూలించడంతో పాటు సామాజిక ఉద్యమాలు సంస్కరణ ఉద్యమాలు నిర్వహించాలని తెలిపారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ జి రమేష్, డాక్టర్ కిషన్ తేజ్, హరీష్, రమేష్ నాయక్, భార్గవి, ధనుంజయ, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : సమతావాది, స్వాతంత్ర్య సమర యోధుడు, రాజ్యాంగ పరిషత్ సభ్యులు ఆధునిక భారతదేశ నిర్మాణం కోసం జీవితాన్ని ధారపోసిన మహనీయుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని రాష్ట్ర ఎంఆర్‌పిఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అరుంధతియపాలెం లో ఆ మహనీయుడి కి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి ప్రజలకు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి శు భాకాంక్షలు తెలిపారు. పలువురు మాట్లా డుతూ బాబూ జగ్జీవన్ రామ్ దేశానికి అలాగే దళిత పీడిత సమాజానికి చేసిన సేవను గూర్చి తెలిపారు. ముఖ్యంగా బాబూ జగ్జీవన్ రామ్‌కి భారత రత్న ప్రకటించేలా చూడాలని ప్రధాని నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. బకీర్ జాషువా, బెజవాడ బాలగురవయ్య మాదిగ, మతకాల నాగేంద్ర కంచు పాటి సురేష్ నల్లిపోగు హజరత్, కన్నెమరకలు పెంచల య్య, మధు కిరణ్, ఓ.జాకబ్, నల్లిపోగు రమేష్, నాగేళ్ల వెంకటరమణ, సయ్యద్ బాదుల్లా, షేక్ నవాజ్, మస్తాన్ కె.ప్రసాద్ ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలోని వేదాయపాలెం, గాంధీనగర్ రోడ్ సెంటర్ లో ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి చేతివృత్తిదారుల జిల్లా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ పూలమాలవేసి ఘనవంవగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుంజి దయాకర్, కటికాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దినేష్ ,బెల్లంకొండ బాల వెంకటేశ్వర్లు, అచ్చితిరుపాలు, జిఎంపిఎస్ నాయకులు శ్రీహరి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కలిగిరి : ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త, భారత ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు మాట్లాడారు.కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో పలుచోట్ల బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను శనివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు బట్టా ప్రవళిక ఆయన చిత్రపటానికి పలువురు సమక్షంలో పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో బట్టా విల్సన్ , గరితోటి వెంకట్, కిషోర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : దేశానికి ఎనలేని సేవలందించిన సామాజిక యోధుడు, ప్రజాసామ్య వాది బాబూ జగ్జీవనరామ్

కావలిలో..

జయంతిని కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం కావలి పట్టణంలోని ముసునూరు టిడిపి కార్యాలయంలో, "మాగుంట పార్వతమ్మ రోడ్డు"లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పూలమాలలు వేసి, ఘన నివాళు లుఅర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ అంటరాని తనాన్ని రూపు మాపాలని, అణగారిన వర్గాలకు రాజకీయ, ఆర్థిక, సామాజికంగా సమాన హక్కులు కల్పించాలనే సంకల్పంతో తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు బాబు జగ్జీవనరామ్ అని అన్నారు. కావలిలో ఆయన స్మారక స్థూపాన్ని, భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవనాన్ని కూడా నిర్మించనున్నట్లు తెలిపారు. వీటితో పాటు లైబ్రరీని ఏర్పాటు చేసి బాబు జగ్జీవనరామ్ జీవిత చరిత్రను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి, చంద్రబాబు నాయుడు జన్మదినాలతో కలిపి, ఈ ఏప్రిల్‌ను త్రిమూర్తుల జన్మ మాసంగా భావించాలన్నారు. ఈ ముగ్గురు మహనుభావుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కావలి ఆర్‌డిఒ సన్నీ వంశీకృష్ణ, టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, రాష్ట్ర కార్యదర్శులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, మొగిలి కల్లయ్య, కండ్లగుంట మధు బాబు నాయుడు, పోట్లూరు శ్రీనివాసులు, పోతుగంటి శ్రీకాంత్, ఏగూరి చంద్రశేఖర్, దావులూరు దేవకుమార్, అర్షియా బేగ, పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిజెపి ఆధ్వర్యంలో... కావలి పట్టణ శాఖ ఆధ్వర్యంలో బిజెపి కావలి 1వ పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్ కుమార్ అధ్యక్షతన శనివారం మాజీ భారత ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు.

వైసిపి ఆధ్వర్యంలో.. కావలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్, మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ, రూరల్ మండలం నాయకులు పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యంలో.. కుల రహిత సమాజం కోసం పాటుపడిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా కావలి పట్టణంలో జగ్జీవన్ రావు విగ్రహానికి సిపిఐ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పదవు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయునికి ఘనంగా నివాళులార్పించారు. ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు బలిజేపల్లి వేంకటేశ్వర్లు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దమ్ము దర్గాబాబు, సిపిఐ కావలి పట్టణ కార్యదర్శి కె.నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయ కులు నరసింహారావు, తదితరులున్నారు.

కాకాణి వ్యవహారంపై సర్వత్రా ఉత్కంఠ

ప్రజాశక్తి-నెల్లూరు

వీ క్ష ణం

ఉమ్మడి జిల్లా వైసిపి అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అక్రమ మైనింగ్, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ వంటి పలు కేసుల విచారణ నిమిత్తం రూరల్ డిఎస్‌పి కార్యాలయానికి హాజరు కావాలని నోటీసులు జారీ చేయడం, తన ఇంటిలో శుభకార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో తాను హాజరు కాలేకపోతున్నానంటూ ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించడం.. పిటిషన్‌పై వాదోపవాదాలు విన్న జడ్జీ ఎటువంటి తీర్పును ప్రకటించకపోవడంతో జిల్లాలో సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. పోలీసులు అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ కోర్టు మంజూరు చేస్తుందా.. లేక తిరస్కరిస్తే పోలీసులు అరెస్టు చేయడం తప్పదా ఏక్షణాన ఏమి జరుగుతుందో అన్న ఆలోచనతలో కాకాణి వర్గీయులు నగరంలోని ఆయన ఇంటి వద్ద రాత్రి, పగలు అన్న తేడా లేకుండా గడిచిన మూడు, నాలుగు రోజుల నుంచి తమ నాయకుడికి తోడుగా నిలిచేందుకు భారీగా చేరుకుంటున్నారు. అయితే పొదలకూరు పోలీసులు నోటీసులు ఇచ్చేందుకు కాకాణి ఇంటికి రావడం తప్పనిసరి అని తెలుసుకున్న వెంటనే హైదరాబాద్ లోని తన కూతురు ఇంటికి వెళ్లిపోయారు. ఇంటికి వచ్చిన పొదలకూరు పోలీసులు చేసేదేమీ లేకపోవడంతో నోటీసులను కాకాణి ఇంటికి అతికించి వెళ్లిపోయారు. హైదరాబాదులోని కూతురు ఇంటిలో ఉన్నట్లు సోషల్ మీడియాలో ఫొటోలు చక్కర్లు కొట్టడంతో మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి నోటీసులు అందజేసేందుకు హైదరాబాదుకు పయనమయ్యారు. వారు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇంటికి వెళ్లేసరికి అక్కడ కూడా లేకపోవడంతో ఆయన బంధువులకు నోటీసులు అందజేసి రూరల్ డిఎస్‌పి కార్యాలయానికి విచారణ నిమిత్తం హాజరు కావాలని కోరారు. దానికి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన మనువడి జన్మదినోత్సవం, ఉగాది పండుగ కార్యక్రమాలు పాల్గొనాల్సి ఉన్నందున తాను హాజరు కాలేనని సమాదానం ఇచ్చారు. మరో ప్రక్క ముందస్తు బెయిల్ కోసం కోర్టులో తన లాయర్ల సహాయంతో పిటిషన్లు దాఖలు చేయడం వాదనలు వినిపించడం వంటి కార్యక్రమాలను చకచకా పూర్తి చేశారు. ఇంత జరిగినా ముందస్తు బెయిల్ మంజూరు చేయక పోవడంతో సోమవారం పోలీసు అధికారుల ఎదుట హాజరు అవుతారా ..లేక హైదరాబాదు నుంచి మరో ప్రాంతానికి చేరుకొని పోలీసుల నుంచి తప్పించుకొనే ప్రయత్నం చేస్తారా అన్నది జిల్లాలో సర్వత్రా చర్చ జరుగుతుంది. మండు వేసవిలో జిల్లాలో పలు ప్రాంతాల్లో శుక్రవారం చిరు జల్లులు కురిశాయి. ఈ చిరుజల్లులు ఎందుకు సంకేతమో అని ప్రజలు భాయాందోళనలకు గురౌతున్నారు. వాతావరణ శాఖ అధికారులు మాత్రం రెండు మూడు రోజుల పాటు వర్షాలు కురేందుకు అవకాశాలున్నాయని, అనంతరం వాతావరణ ఉష్ణోగ్రతలు దాదాపుగా 4 డిగ్రీలు పెరిగేందుకు అవకాశం ఉంటుందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మదురై ప్రాంతంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సిపిఎం అఖిల భారత 24వ మహాసభలకు హాజరైయ్యేందుకు జిల్లానుంచి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా బయలుదేరి వెళ్లారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోద ముద్ర పడటాన్ని వామపక్ష పార్టీలు తప్పుబుడుతున్నాయి. దేశ వ్యాప్తంగా మైనార్టీ వర్గాలు ఈ బిల్లు ఆమోదం పొందడంతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నదం అవుతున్నాయి.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-సంగం : మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి గుడి ప్రాంతంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎపి ఉపాధ్యాయ సంఘం నాయకులు శనివారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజ గోపాల చార్యులు పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆపస్ నాయకులు సురేంద్ర రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, వేణు గోపాల్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు అప్రజాస్వామికం

ప్రజాశక్తి-బిట్రగుంట

దేశవ్యాప్తంగా ముస్లిం సోదరులు ఎన్నో అభ్యంతరాలు తెలిపిన, ఆందోళన చేసిన, కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును కక్షపూరితంగా ఆమోదించిందని, మైనార్టీ నాయకులు షేక్.నూరుద్దీన్ అన్నారు. వక్ఫ్‌బోర్డ్ చట్టంపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా శనివారం బోగోలు సిపిఎం కార్యాలయంలో బోగోలు మండల సిపిఎం శాఖ సీనియర్ నాయకులు తుమ్మల వెంకయ్య, బోగోలు మండల సిఐటియు కార్యదర్శి చల్లా నరహరి, బోగోలు మండలం మైనార్టీ నాయకులు జహీర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ముస్లింలను టార్గెట్ చేస్తూ దేశంలో ఎలాంటి సమస్యలు లేవని, హిందూ – ముస్లిం అల్లర్లు సృష్టించడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు మత స్వేచ్ఛ సమానత్వం సమైక్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందన్నారు. వివక్షత కూడుకున్న ఇలాంటి చట్టాలను ఆమోదించడం కేంద్ర ప్రభుత్వానికి తగదన్నారు, ముస్లింల వద్ద ఉన్న లక్షల విలువైన భూములను దోచి కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పాలని, కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గత పదేళ్ల పాలనకు అది నిదర్శనం అన్నారు. ఒకపక్క చైనా, భారత భూభాగాన్ని ఆక్రమిస్తున్న, వాటిపై ఎలాంటి చర్యలు చేపట్టని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశంలో హిందూ – ముస్లిముల ఐక్యతను దెబ్బతీసే విధంగా దేశంలో మత కల్లోలాన్ని సృష్టించి, రాక్షస పాలన చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన తెలుగుదేశం, జెడియు పార్టీలు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. ముస్లిములపై ఉన్న ధ్యాస భారతదేశ ఆర్థిక వ్యవస్థపై, పేదలపై చూపిస్తే బాగుంటుందన్నారు. ముస్లిములపై మొసలి కన్నీరు కారుస్తూ ముస్లిములకు తీరని అన్యాయం చేస్తుందని, దానిని యావత్ భారతదేశం ముస్లిం సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో విశ్వనాధరావు పేట సిపిఎం నాయకులు ఎస్.రామయ్య, మైనార్టీ నాయకులు షేక్.అహ్మద్ బాషా, నవీద్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

వివాదాస్పదంగా విద్యార్థిని మిస్సింగ్ కేసు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలం రాజవోలు గ్రామ పంచాయతీకి చెందిన ఓ డిగ్రీ విద్యార్థిని మిస్సింగ్ కేసు వివాదాస్పదంగా మారింది. తమ అమ్మాయి తప్పిపోయి నెలరోజులు పైగా అవుతున్న ఎఎస్‌పేట పోలీసులు స్పందించకపోవడంతో, శనివారం బాధితులు వారి బంధువులు కొంతమంది రాజోలు గ్రామస్తులు కలిసి, డిఎస్‌పి కార్యాలయం వద్దకు చేరుకొని, తమ బిడ్డ ఆచూకీపై ఎఎస్‌పేట పోలీసులు సరిగా స్పందించక పోవడంతో, తమ అమ్మాయి ఆచూకీ కనుగొనాలని డి.ఎస్.పి.కి విజ్ఞప్తి చేసేందుకు వచ్చారు. ఆ సమయానికి డిఎస్‌పి లేకపోవడంతో అక్కడే ఆందోళన చేయడానికి సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న ఆత్మకూరు సిఐ గంగాధర్, ఎస్ఐ జిలాని వెంటనే డి.ఎస్.పి. కార్యాలయం వద్దకు వచ్చి, వారితో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. వెంటనే వీరి విజ్ఞప్తిని స్పందించి సిఐ గంగాధర్ అమ్మాయి ఆచూకీ కనుగొనేందుకు, ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సిఐ మాటలతో సంతృప్తి చెంది తిరిగి తమ గ్రామానికి వెళ్తున్నామని నాలుగు రోజుల తర్వాత తమ బిడ్డ ఆచూకీ తెలుస్తుందని నమ్మకంతో ఉన్నామని అక్కడి నుంచి బయల్దేరి వారి గ్రామానికి వెళ్లిపోయారు.

ఇళ్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని గెస్ట్ హౌస్ యజమానులు, అద్దెకు ఇల్లు ఇస్తున్న యజమానులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎ.సైదులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పవిత్ర పుణ్యక్షేత్రమైన ఖాజా నాయబ్ రసూల్, దొరసానమ్మ వెలసియున్న ఎఎస్‌పేటలో సుదూర ప్రాంతాల నుంచి, గుర్తుతెలియని వ్యక్తులు, తెలంగాణ, కర్ణాటక, తదితర ప్రాంతాల నుంచి వస్తూ ఉంటారని, కాబట్టి తప్పనిసరిగా సిసి కెమెరాల బిగించుకొని, నిరంతరం అవి పని చేసే విధంగా ఏర్పాటు చేసుకొని, ఆధార్ తదితర వివరాలను సంబంధిత రికార్డులలో కచ్చితంగా నమోదు చేసుకున్న తర్వాత మాత్రమే రూములను కేటాయించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అలాకాకుండా నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించిన వారిపై కేసుల నమోదు చేస్తామని తెలియజేశారు.

In the Court of The III Addl. District Judge : Nellore

I.A.No. 410 / 2022

O.S.No. 45 / 2022

Bhagyapalli Nickloes - Petitioner / Plaintiff

Vs

K.Venkata Ramana - Respondent / Defendant

Notice

To,
D1. K.Venkata Ramana,
S/o **Kannan,** Door No.26/14/1176-1,
Vanamthopu, Near Steel Factory,
Kondayapalem, Nellore City.

పై నెంబరున పిటీషనర్ / వాది డిస్మిసల్ ఆర్డర్‌ని సెటసైడ్ చేయమని కోరుతూ పై తెలిపిన కోర్టులో మీపై పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే08-04-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎస్‌కె.నన్నేసాహెబ్, బి.కాం., బి.ఎల్.,
ఎస్‌కె.రియాజ్ బాషా, బి.ఎ.ఎల్., బి.ఎల్.,
ఎస్‌కె.ఖలీల్ బాషా, ఎం.ఎ., బి.ఎల్.,
పిటిషనర్ / వాది తరపు అడ్వకేట్స్, నెల్లూరు.

In the Court of Hon'ble III Addl. Junior Civil Judge : Nellore

O.S.No. 586 / 2024

K.Sushmalatha - Plaintiff

Vs

1. K.Rajakumari and 2 others - Defendants

Notice

To,
D1. K.Rajakumari,
W/o Bhaskar Rao, Occ: House hold,
R/o Door No.25-01-786, Z.P.Colony,
Podalakuru Road, Nellore Town.
D2. S.Suhashini,
D/o Bhaskar Rao, Occ: House hold,
R/o Door No.25-01-786, Z.P.Colony,
Podalakuru Road, Nellore Town.

పై నెంబరున వాది దావా షెడ్యూలు ఆస్తికి సంబంధించిన ప్రతివాది దస్తావేజు చెల్లనిదిగా ప్రకటించమని మరియు ఆ దస్తావేజు వాదిపై ఎటువంటి ప్రభావం కలిగి ఉండదని మరియు ఇంజంక్షన్ కోరుతూ పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే08-05-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

జి.అంజయ్య
ఎం.అక్షిత
కె.నిరంజన్ రెడ్డి
పి.వంశీనాథ్
వాది తరపు అడ్వకేట్స్